ఉలవ రైతు నిలువు దోపిడీ

- మద్దతు ధర ప్రకటించని కూటమి ప్రభుత్వం
- ఉత్పత్తులను కొనుగోలు చేయని వైనం
- బహిరంగ మార్కెట్‌లో లభించని గిట్టుబాటు ధర
- క్వింటాకు 10 కిలోల చొప్పున దోచుకొంటున్న వ్యాపారులు



దొన్నికోట గ్రామంలోని ఓ ఇంట్లో సంచుల్లో నిల్వ ఉంచిన ఉలవలు

నల్లమాడ: ఉలవ రైతు నిలువు దోపిడీకి గురవుతున్నాడు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామంటూనే ఆ పంట దిగుబడులను కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు సంకట స్థితిని ఎదుర్కొంటున్నారు. గతేడాది రబీలో ప్రత్యామ్నాయ పంటగా రైతులు ఉలవ పంట సాగుచేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పంట నూర్పిడి చేసి దిగుబడిని అమ్మేందుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే కూటమి ప్రభుత్వం ఉలవకు మద్దతు ప్రకటించకపోగా కొనుగోలు సైతం చేయకపోవడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో దళారులను ఆశ్రయించి మోసపోవాల్సిన దుస్థితి నెలకొంది.

పెరిగిన సాగు విస్తీర్ణం

ప్రధాన వేరుశనగ పంట వల్ల పెద్దగా లాభం లేకపోగా పంట సాగు ఖర్చు తక్కువగా ఉండటం, కలుపు తీయడం, మందులు పిచికారీ చేసే అవసరం లేకపోవడంతో ఉలవ పంట సాగుపై రైతులు దృష్టి సారించారు. సబ్సిడీపై విత్తనం కూడా సరఫరా చేయడంతో గతంలో కంటే రబీ సీజన్‌లో ఉలవ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు 13,606 ఎకరాల్లో రైతులు ఉలవ పంట సాగు చేసినట్లు అధికారుల అంచనా.

ఉలవను కొనుగోలు చేయని ప్రభుత్వం

రైతు సంక్షేమ తమ ధ్యేయమంటూ బాకా ఊదుతున్న కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఉలవకు మద్దతు ధర ప్రకటించకపోగా కొనుగోలు ప్రయత్నం కూడా చేయలేదు. ఉలవ పంట నమోదు (ఈ క్రాప్ బుకింగ్) చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని రైతన్నలు నిట్టూరుస్తున్నారు. దీంతో గిట్టుబాటు ధర కోసం రైతులు ఉలవలను సంచుల్లో పోసి ఇళ్లలో నిల్వ చేయడం ప్రతి గ్రామంలోనూ కన్పిస్తోంది. నెలల తరబడి ఉలవలు అలాగే నిల్వ ఉంచితే పురుగులు పడి పాడై పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పుట్టపర్తి నియోజకవర్గంలో ఉలవ సాగు వివరాలు	
మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
ఓడీ చెరువు	3,008
నల్లమాడ	1,953
అమడగూరు	1,960
పుట్టపర్తి	2,360
కొత్తచెరువు	2,150
బుక్కపట్నం	2,175
మొత్తం	13,606

బహిరంగ మార్కెట్‌లో నిలువుదోపిడీ

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటా ఉలవలు రూ.3,500 నుంచి రూ.3,700 వరకు ధర పలుకుతోంది. అయితే నాణ్యత లోపించిందని, తేమ శాతం ఎక్కువగా ఉందని సాకులు చూపిపారులు ఒక క్వింటాకు ఎనిమిది నుంచి 10 కిలోల ఉలవలను అదనంగా తీసుకుంపలువురు రైతులు వాపోతున్నారు. ఉలవ పంట సాగుకు ఒక ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి పెట్టారు. ఎకరాకు మూడు క్వింటాళ్లు దిగుబడి రావడంతో బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తే తమకు మిగిలేదేమీ ఉండదని రైతన్నట్లు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ఉంటే క్వింటా రూ.4 వేలకుపైగా ధర లభించేదని చెబుతున్నారు.

ఉలవలు కొనుగోలు చేయాలి



ఉలవకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు అడిగిన ధరకు ఉలవలు అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చింది. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామంటూ వాటి దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం బాధాకరం. అన్ని విధాలుగా రైతుకు నష్టమే జరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఉలవకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలి.

– ఎం. నరసింహులు, రైతు, దొన్నికోట, నల్లమాడ మండలం

పంటను గొర్రెలకు వదిలేశా



నేను ఐదెకరాల్లో ఉలవ పంట సాగుచేశా. ట్రాక్టర్‌తో సేద్యం, క్వింటా విత్తన ఉలవలకు రూ.10 వేలకు పైగా ఖర్చు వచ్చింది. పంట నూర్పిడికి వచ్చే సమయానికి మార్కెట్‌లో క్వింటా ఉలవ ధర రూ.3,500 పలుకుతోంది. నూర్పిడి ఖర్చులు అన్నీ కలిపితే ఏం గిట్టుబాటు కాదని భావించి పంటను గొర్రెలకు వదిలేశా. ప్రభుత్వం స్పందించి ఉలవ రైతులను ఆదుకోవాలి.

–దేవణానాయక్, రైతు, గోపేపల్లి తండా, నల్లమాడ మండలం

క్లుప్తంగా

మోటారు వాహనాల కొత్త చట్టాలపై అవగాహన


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

ఓడీచెరువు: మోటారు వాహనాల కొత్త చట్టాలపై పోలీసులు ఆదివారం స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. బైక్‌పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. బైకుపై వెనుక కూర్చున్న వ్యక్తి హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదన్నారు. కాలుష్య ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని, అతివేగంగా వాహనం నడపరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు

బాధితుడికి పరామర్శ


బాధితున్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: గంగిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఆదిరెడ్డి గారి నాగిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గ్రామానికి చేరుకుని నాగిరెడ్డిని పరామర్శించారు. నాగిరెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అన్నివేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం అర్బన్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హేమంత్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్స్ ఉన్నవారికి డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. జన జీవనానికి ఆటంకం కలిగించే ఎంతటి వారైనా చట్ట ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. టూ టౌన్ సీఐ రెడ్డప్ప, పోలీసులు ఉన్నారు.

ప్రారంభమైన రంజాన్ దీక్షలు


బత్తలపల్లి మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బత్తలపల్లి: ముస్లింలకు పరమ పవిత్రమైన రంజాన్ మాసం దీక్షలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున నుంచి సాయంత్రం వరకు ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలను పాటించారు. ఈ మాసంలో పొద్దంతా ఉపవాసంతో ఆరోగ్యం దెబ్బతినకుండా పౌష్టికాహారం తీసుకుంటారు. ఉపవాస దీక్షతో ఎదుటి వారి ఆకలి బాధ తెలియడంతో పాటు సహనగుణం పెరుగుతుందని, కష్టాలను ఎదుర్కొనే శక్తి లభిస్తుందని ముతవల్లి సులేమాన్ పేర్కొన్నారు. రోజూ చేసే ప్రార్థనలు కన్నా తరవీహ్ నమాజ్‌కు ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. దురలవాట్లకు దూరంగా సత్యనిష్టగా ఉంటామన్నారు. దివ్య ఖురాన్ ప్రబోధాలను తెలుసుకుని ఆచరించడానికి ప్రయత్నిస్తామన్నారు. వయోబేధం లేకుండా అందరూ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

పోతలప్ప, చెన్నకేశవస్వామి ఉత్సవాలు ప్రారంభం

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లిలో పోతలప్ప, చెన్నకేశవ స్వామి ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా భక్తులు ఎలవగంపను పురవీధుల్లో ఉరుములు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం పోతలప్ప ఆలయానికి చేరుకున్నారు. పోతలప్ప, చెన్నకేశవ స్వామి మూలవిరాట్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. సోమవారం ఉదయం పోతలప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాసంగాల మడుగు కార్యక్రమం, సాయంత్రం కమ్మవారిపల్లి చింత తోపులో ఎడ్లబండ్ల పోటీలు, నవరత్నాలు నాటకం ప్రదర్శించనున్నారు.


ఎలువగంపను ఊరేగిస్తున్న దృశ్యం

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

పుట్టపర్తి టౌన్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని పట్టణ సీఐ సునీత సూచించారు. ఆదివారం పట్టణ సమీపంలో ఉన్న శిల్పారామంలో సీఐ సునీత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు హ్యాపీ అవర్స్ పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నట్లయితే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, పోలీస్ అత్యవసర సేవలకు 100, నేషనల్ ఎమర్జెన్సీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సునీత

నాటుసారా విక్రేత అరెస్టు

బత్తలపల్లి: డి.చెర్లోపల్లి క్రాస్ వద్ద నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నవోదయం 2.0లో భాగంగా ఆదివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేపట్టారు. ఇందులో భాగంగా డి.చెర్లోపల్లి క్రాస్ చిన్న కుళ్లాయప్పనాయక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమణి తెలిపారు. ఎవరైనా నాటు సారా తయారు చేసి అమ్ముతుంటే తమకు సమాచారం ఇవ్వాలని, అట్టి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు నాటు సారా తాగి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సూచించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు బాంద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

ముదిగుబ్బ: సంకేపల్లి వద్ద వీరనారాయణస్వామి పరుష రెండు రోజుల క్రితం ఘనంగా జరిగిన విషయం విదితమే. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. మొత్తం రూ.7,45,627 నగదు వచ్చినట్లు వారు తెలిపారు. ఇదిలా ఉండగా పోలీసుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించాలని ఆదివారం రాత్రి సంకేపల్లి గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు లేకుంటే హుండీ కానుకల లెక్కింపులో అవకతవకలకు అవకాశముంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


నీలకంఠారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పార్టీ నాయకులు

కనగానపల్లి: మండలంలోని గుంతపల్లిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నీలకంఠారెడ్డి (60) అనారోగ్యంతో మృతి చెందాడు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అయితే ఆరోగ్యం కుదటపడక ఇంటి వద్ద మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మండల నాయకులతో కలసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నీలకంఠారెడ్డి మృతదేహానికి పూలమా వేసి నివాళులర్పించారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన కారు

- 5 గొర్రెల మృతి, కాపరికి గాయాలు


మృతి చెందిన గొర్రెలు

చెన్నేకొత్తపల్లి: ఎన్‌ఎస్ గేట్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం గొర్రెల మందపైకి ఓ కారు దూసుకెళ్లడంతో ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. రామగిరి మండలానికి చెందిన గొర్రెల కాపరి గంగాధర్ ఆదివారం గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. ఎన్‌ఎస్‌గేట్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గొర్రెల మంద రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 5 గొర్రెలు మృతి చెందగా.. గొర్రెల కాపరి గంగాధర్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిని వ్యక్తికి చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రైనర్ రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆంగ్లంలో సులువుగా మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి దాదాపు 2500 మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన డీఈఓ కిష్టప్పకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక

పుట్టపర్తి టౌన్: స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం పట్టణాధ్యక్షుడు కళ్యాణ్ ఆధ్వర్యంలో నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శులుగా నారాయణ, లక్ష్మీరాయణ నాయక్, ఉపాధ్యక్షులుగా కుమార్, శివశంకర్‌రెడ్డి, జయరాం, నాగేష్, సత్యమయ్య, కోశాధికారిగా నాగభూషణ, కార్యదర్శులుగా మధుసూదన్, వెంటకరమణమ్మ, నంజప్ప, రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణగౌడ్, కత్తిరాజారెడ్డి, జ్యోతి ప్రసాద్, బాలగంగాధర్, సరేంద్రబాబు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులు 119 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 42 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. అనంతరం శిబిరం దాతలను శాలువాలతో సన్మానించారు. యువర్స్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సుంకు సుకుమార్, సహాయ కార్యదర్శి రమేష్‌బాబు, పీఆర్‌ఓ రాధాకృష్ణ, క్యాంపు చైర్మన్ పోలా ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే విజయం తథ్యం

బత్తలపల్లి: విద్యార్థులు ఇష్టపడి చదివితే విజయం తథ్యమని శ్రీజ్యోతి హైస్కూల్ కరస్పాండెంట్, హెచ్‌ఎంలు ధర్మతేజ, లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువులో రాణించాలన్నారు. అంతకు ముందు పండితుల ఆధ్వర్యంలో సరస్వతి, గణపతి పూజ నిర్వహించారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

తనకల్లు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలని కదిరి రూరల్ సీఐ నాగేంద్ర సూచించారు. కొక్కంటిక్రాస్‌లో ఆదివారం వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీట్ బెల్టు, హెల్మెట్ ధరించకపోయినా, లైసెన్స్ లేకపోయినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఓడీచెరువు: స్థానిక శ్రీ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం 2003–2004 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చాలాకాలం తర్వాత కలవడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. గత స్మృతులను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాల కరస్పాండెంట్ మస్తాన్, ఉపాధ్యాయులు సుధాకర్, గఫూర్, పూర్వ విద్యార్థులు శ్రీధర్‌రెడ్డి, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.



దాదులూరులో జాతర సందడి


అలంకరణలో చెన్నకేశవస్వామి


జాతరలో ఏర్పాటు చేసిన మిఠాయి, గాజుల దుకాణాలు

కనగానపల్లి: దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్య స్వామి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. శివ, కేశవులు ఒకేచోట కొలువైన ఉన్న దేవాలయానికి రెండు గోపురాలు, ఆలయ ప్రాకారం ఉంది. ప్రతి ఏటా మహాశివరాత్రి తర్వాతా ఇక్కడ జరిగే జాతరకు సుదూరు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరలో పోతలయ్య స్వామికి జరిగే గావుల మహోత్సవ కార్యక్రమానికి ప్రత్యేకత ఉంది. అనాది కాలంగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉరుముల శబ్దాలు, పోతు రాజుల నృత్యాలతో కోలాహలంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పన్నేరపు బండ్లు, మహిళల జ్యోతుల ఊరేగింపుతో వైభవంగా జరుగుతుంది. ఇక జాతర సందర్భంగా ఆలయ ఆవరణలో జరిగే జాతర జనంతో కిక్కిరిపోతుంది. ఇక్కడికి చుట్టు పక్కల నుంచి వచ్చిన వ్యాపారులు వందల సంఖ్యలో మిఠాయి, గాజులు, బొమ్మల కొట్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటితో పాటు ఆలయం ముందు ఏర్పాటు చేసే టెంకాయల కొట్లు, లడ్డూ ప్రసాదాలు విక్రయిస్తారు. ఆదివారం నుంచి ప్రారంభమైన ఈ జాతరకు ఇప్పటికే దూర ప్రాంతాల భక్తులు వస్తున్నారు. తొలిరోజు స్వామి కాపులు ఎలవ గంపలో తెచ్చిన ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలకంరించి పూజలు నిర్వహించారు. ఇక సోమ, మంగళవారాల్లో జరిగే జ్యోతులు, గావుల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి తెలిపారు. లక్షలాది మంది కలిసే ఈ జాతరకు ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.